నమస్తే తెలంగాణ

సిద్దిపేట

I హైదరాబాద్, బుధవారం 30 ఏప్రిల్ 2025 SIDDIPET




గీతం అచీవర్స్ డేలో పాల్గొన్న కార్పొరేట్ సంస్థల ప్రతినిధులు

# గీతంలో విజేతల దినోత్సవం

## గీతం విద్యార్థికి రూ.1.40 కోట్ల వేతనంతో కొలువు

పటాన్‌చెరు రూరల్, ఏప్రిల్ 29: గీతం స్కూల్ ఆఫ్ టెక్నాలజీ హైదరాబాద్‌కు చెందిన సీఎస్‌ఈ విద్యార్థిని కారుమూరు ప్రియాంకరెడ్డి ప్రాంగణ నియామకాల్లో ప్రతిష్టాత్మక అమెజాన్ కంపెనీకి రూ.1.40 కోట్ల వార్షిక ప్యాకేజీతో ఎంపికయ్యారు. మంగళవారం పటాన్‌చెరు మండలం రుద్రారంలోని గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం హైదరాబాద్‌లోని కెరీర్ గైడెన్స్ సెంటర్ (సీజీసీ) అచీవర్స్ డేను ఘనంగా నిర్వహించింది. ప్రాంగణ నియామకాల్లో ఎంపికైన ఇంజినీరింగ్, మేనేజ్‌మెంట్, ఫార్మసీ, సైన్స్, హ్యూ మానిటీస్ అండ్ సోషల్ సైన్సెస్ విద్యార్థులకు నియామక పత్రాలతోపాటు విదేశాల్లో ఉన్నత విద్య అభ్యసించడానికి సీట్లు పొందిన అభ్యర్థులకు ప్రవేశపత్రాలను అందజేశారు. 2024-25 విద్యా సంవత్సరంలో దాదాపు 270కి పైగా దేశీయ, బహుళజాతి కంపెనీలు హైదరాబాద్ గీతంలో ప్రాంగణ నియామకాలను నిర్వహించి, బీటెక్, ఎంటెక్, బీబీఏ, బీకాం, ఎంబీఏ, బీ-ఫార్మసీ, బీఎస్సీ, ఎమ్మెస్సీ, బీఏ విద్యార్థులను ఎంపిక చేశాయని, వచ్చే రెండు నెలల్లో మరో 40 సంస్థలు ప్రాంగణ నియామకాలు చేపట్టనున్నాయని గీతం వర్గాలు తెలిపాయి. కొందరు విద్యార్థులు ఉన్నత విద్యాభ్యాసం కోసం దరఖాస్తు చేసుకొని దేశ, విదేశాల్లోని ప్రతిష్టాత్మక విద్యాసంస్థల్లో ప్రవేశ అర్హత సాధించినట్టు తెలిపా రు. అగ్రశ్రేణి కంపెనీల్లో ఇంటర్న్‌షిప్ చేసిన పలువురు విద్యార్థులను ఆకర్షణీయమైన ప్యాకేజీలతో ఉద్యోగులుగా తీసుకున్నట్టు తెలిపారు. తొలిసారి ప్రభుత్వరంగ సంస్థ భారత్ ఎలక్ట్రానిక్స్ లిమిటెడ్(బీఈఎల్) ప్రాంగణ నియామకం చేపట్టి, ముగ్గురిని ఫిక్స్‌డ్ టర్మ్ ఇంజినీర్లుగా ఎంపిక చేసిందని తెలిపారు.

**అమెజాన్‌లో రూ.1.40 కోట్ల ప్యాకేజీతో కొలువు**

అమెజాన్ సంస్థ రూ.1.40 కోట్ల గరిష్ఠ వార్షిక వేతనం, అట్లాసియన్ రూ.60లక్షల గరిష్ఠ వార్షిక వేతనం, మైక్రోసాఫ్ట్ రూ. 51లక్షలు, వర్చ్యూసా ఇంటర్నేషనల్ రూ.47.9లక్షలు, సిలికాన్ ల్యాబ్స్ రూ. 30.6లక్షలు, ఫెడరల్ బ్యాంక్ రూ. 16.42లక్షలు, తా ట్ వర్క్స్, ఒరాకిల్, డెలాయిట్, హెచ్‌ఎస్‌బీసీ, డెలివరూ మొదలైన సంస్థలు ఆకర్షణీయమైన వేతన ప్యాకేజీలతో గీతం విద్యార్థులను ఎంపిక చేసుకున్నాయి. గీతం అచీవర్స్ డేలో అరబిందో ఫార్మా అసోసియేట్ ప్రెసిడెంట్ డాక్టర్ సురేశ్ కుమార్, ఇనోవాలోన్ హెచ్‌ఆర్ విభాగం డైరెక్టర్ అండ్ జీఎం కార్తీక్ ఎలమంచిలి గౌరవ అతిథులుగా పాల్గొని విద్య, ఉపాధి అంశాలపై దిశానిర్దేశం చేశారు. సమయపాలన, క్రమశిక్షణ, ప్రతిభ, స్కిల్స్ ఎంచుకున్న రంగంలో రాణించేందుకు దోహదపడుతాయని పేర్కొన్నారు. కష్టపడే వారికి ప్రపంచంలో ఎన్నో అవకాశాలు ఉన్నాయన్నారు. అదనపు ఉపకులపతి ప్రొఫెసర్ డీఎస్‌రావు, స్కూల్ ఆఫ్ టెక్నాలజీ డైరెక్టర్ ప్రొఫెసర్ వీఆర్ శాస్త్రి నియామకాల్లో ఎంపికైన విద్యార్థులను అభినందించారు. ప్రొఫెసర్ శివకుమార్, డాక్టర్లు దివ్యకీర్తి గుప్తా, మోతాహార్ రెజా, బందన కుమార్ మిశ్రా, ప్రదీప్, స్కూల్ ఆఫ్ టెక్నాలజీ అసిస్టెంట్ డైరెక్టర్ ప్రొఫెసర త్రినాథరావు పాల్గొన్నారు.



గీతం అచీవర్స్ డేలో పాల్గొన్న విద్యార్థులు వారి తల్లిదండ్రులు

# మూడేండ్లుగా సాగుతున్న పనులు

## దుమ్మూధూళి, గుంతలతో వాహన చోదకుల ఇబ్బందులు



జహీరాబాద్ అల్గోల్ బైపాస్ రోడ్డు సమీపంలో అసంపూర్తిగా మిగిలిన బ్రిడ్జి, బీటీ రోడ్డు పనులు

జహీరాబాద్, ఏప్రిల్ 29: కాంట్రాక్టర్ నిర్లక్ష్యం, అధికారుల పట్టింపులేనితనంతో జహీరాబాద్ పట్టణంలో బ్రిడ్జి కమ్ రోడ్డు పనులు ముందుకు సాగడం లేదు. జహీరాబాద్ పట్టణం నుంచి భరత్‌నగర్ గుండా అల్గోల్ బైపాస్‌కు వెళ్లేదారిలోని వాగును తలపించేలా మురుగు ప్రవహిస్తున్నది. నిత్యం జహీరాబాద్‌లోని పలు వార్డుల నుంచి వచ్చే మురుగు దీనిగుండా ప్రవహిస్తుంది. వర్షాకాలంలో మురుగుతోపాటు వర్షం నీటితో వాహనాల రాకపోకలు నిలిచిపోతున్నాయి. ఈ రోడ్డు గుండానే పట్టణసమీపంలోని భరత్‌నగర్, అల్లానా ఫ్యాక్టరీ, అల్గోల్, పోట్‌పల్లి, ఎల్గోయి తదితర గ్రామాల ప్రజలు రాకపోకలు సాగిస్తుంటారు. ఈ రోడ్డు గుండానే బీదర్, హైదరాబాద్ తదితర ప్రాంతాలకు వాహన రాకపోకలు సాగిస్తుంటాయి. ఈ సమస్య పరిష్కారానికి మూడేండ్ల క్రితం బీఆర్‌ఎస్ ప్రభుత్వం ఇక్కడ బ్రిడ్జి కమ్ రోడ్డు నిర్మాణానికి రూ.33 లక్షల నిధులు మంజూరు చేసింది. అప్పట్లో టెండర్లు పూర్తికాగానే కాంట్రాక్టర్ పనులు ప్రారంభించాడు. ఆ తర్వాత బిల్లుల చెల్లింపులో జాప్యంతో కాంట్రాక్టర్ పనులు మధ్యలో ఆపేశాడు. ఆ తర్వాత ప్రభుత్వం మారడంతో పనుల్లో పురోగతి కరువైంది. ఆ తర్వాత స్థానిక ప్రజాప్రతినిధుల ఒత్తిడితో ఆర్‌అండ్‌బీ అధికారులు బ్రిడ్జి నిర్మాణ పనులు పూర్తి చేయించారు. కానీ, బీటీ రోడ్డు పనులు పూర్తిచేయించ లేదు. గత వర్షాకాలం ఈ రోడ్డు గుంతలమయంగా మారడంతో ప్రజలు, వాహనచోదకులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. గుంతలు పడి అధ్వానంగా తయారైన రోడ్డుతో వాహనాలు అదుపుతప్పి అనేక మంది ప్రమాదాలకు గురయ్యారు. స్థానిక ప్రజాప్రతినిధులు సంబంధిత అధికారులతో మాట్లాడి నిర్మాణం పూర్తి చేసుకున్న బ్రిడ్జికి ఇరువైపులా మొరం పోయించారు. కానీ, నెలలు గడుస్తున్నప్పటికీ బీటీ రోడ్డు పనులు మాత్రం చేపట్టడం లేదు. ఫలితంగా దుమ్మూ ధూళి, గంతలతో వాహనచోదకులు, ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. వర్షాకాలం సమీపిస్తుండడంతో అధికారులు స్పందించి పనులు పూర్తిచేయించాలని వాహనచోదకులు, ప్రజలు కోరుతున్నారు.

# ఎమ్మెస్ ఫ్యాక్‌టిక్ కంపెనీ మాకొద్దు

చిన్నశంకరంపేట, ఏప్రిల్ 29: మండలంలోని చందంపేటలో ఎమ్మెస్ ఫ్యాక్‌టిక్ అనే కంపెనీ నిర్మాణ పనులను చందంపేట గ్రామస్తులు అడ్డుకున్నారు.మంగళవారం జేసీబీతో పనులు ప్రారంభించగా, విషయం తెలుసుకున్న గ్రామస్తులు కంపెనీ వద్దకు వెళ్లి నిరసన వ్యక్తం చేశారు. నూతన కంపెనీ గ్రామానికి 300మీటర్ల దూరంలో ఉందని, కాలుష్యంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటామని ప్రజలు ఆవేదన వ్యక్తం చేశారు. బోరు నీళ్లు కలుషితమై సమస్యలతో సతమతమవుతామని, అధికారులు స్పందించి కంపెనీ నిర్మాణ పనులు అడ్డుకోవాలని డిమాండ్ చేశారు.



చిన్నశంకరంపేట మండలం చందంపేటలో నిరసన వ్యక్తం చేస్తున్న గ్రామస్తులు

# మొక్కలు నాటడంతోపాటు సంరక్షించాలి

జగదేవపూర్, ఏప్రిల్ 29: రాజ్యసభ ఎంపీ సంతోష్‌కుమార్ గ్రీన్ చాలెంజ్‌లో భాగంగా హరితసేన కార్యక్రమం ద్వారా మండలంలో పుట్టినరోజు, పెండ్లిరోజు వేడుకలను పురస్కరించుకొని ముమ్మరంగా మొక్కలు నాటే కార్యక్రమం చేపడుతున్నట్లు హరితసేన గజ్వేల్ ఇన్‌చార్జి అనిల్ మొగిలి తెలిపారు. మంగళవారం మండలంలోని లింగారెడ్డిపల్లికి చెందిన జ్యోతిశ్రీనివాస్‌రెడ్డి, కనకలక్ష్మి చంద్రం పెండ్లిరోజును పురస్కరించుకొని మొక్కలు నాటారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గ్రీన్ చాలెంజ్‌లో భాగంగా మొక్కలు నాటడంతో పాటు మండల వ్యాప్తంగా సంరక్షించేలా అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో రాజేశ్వరరావు, నాయకులు ఉన్నారు.



హరితసేన ఆధ్వర్యంలో మొక్కలు నాటుతున్న శ్రీనివాస్‌రెడ్డి దంపతులు

# పేస్కేల్ అమలు చేయాలి

- పెండింగ్ వేతనాలు విడుదల చేయాలి
- మెదక్ అదనపు కలెక్టర్‌కు ఈజీఎస్ ఉద్యోగుల వినతి



వినతిపత్రం అందజేస్తున్న ఈజీఎస్ ఉద్యోగులు

మెదక్, ఏప్రిల్ 29 (నమస్తే తెలంగాణ): ఈజీఎస్ ఉద్యోగులకు పేస్కేల్ అమలు చేయాలని, మూడు నెలల పెండింగ్ వేతనాన్ని తక్షణం చెల్లించాలంటూ మెదక్ జిల్లా అదనపు కలెక్టర్ నగేశ్‌కు మంగళవారం ఈజీఎస్ ఉద్యోగుల జేఏసీ వినతిపత్రం అందజేసింది. ఈ సందర్భంగా జిల్లా జేఏసీ చైర్మన్ రాజ్ కుమార్ మాట్లాడుతూ..మూడు నెలలుగా వేతనాలు రాకపోవడంతో ఆర్థిక ఇబ్బందులకు గురవుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాలను చేరుకోవడానికి తమవంతు కృషి చేస్తున్నట్లు తెలిపారు. ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయాలని, లేనిచో సమ్మె కార్యాచరణ ప్రకటిస్తామని తెలిపారు. అనంతరం జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారికి సైతం వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో మహిపాల్ రెడ్డి, శ్యామ్‌కుమార్, శంకర్, పాల్, వేణు, కృష్ణ, రాజేశ్వర్, రాము, శశిరేఖ, స్వప్న, బాలరాజ్, అనిల్, సంతోష్ పాల్గొన్నారు.

# ప్రభుత్వ భూమికి ఎసరు..?

- 343 సర్వేనంబర్‌లో 300 ఎకరాల ప్రభుత్వ భూమి
- నకిలీ పత్రాలు సృష్టించి కబ్జా చేసేందుకు కొందరు యత్నం
- భూమిలో రాళ్లు, చెట్లు తొలగింపు
- అధికార పార్టీ నేతల అండతోనే కబ్జాకు యత్నం..?
- స్థానికులు ఫిర్యాదు చేసినా పట్టించుకోని రెవెన్యూ అధికారులు
- జీవవైవిధ్యంపై తీవ్ర ప్రభావం
- సమీపంలోని చెరువు జంతుజాలంపై ఎఫెక్ట్

## అమీన్‌పూర్‌లో రూ.100 కోట్ల విలువ చేసే ప్రభుత్వ భూమి కబ్జా ?



అమీన్‌పూర్‌లోని ప్రభుత్వ భూమిలో అక్రమంగా చెట్లు, రాళ్లను తొలగిస్తున్న జేసీబీ



అమీన్‌పూర్‌లోని ప్రభుత్వ భూమిలో అక్రమంగా రాళ్లు, చెట్లు తొలగించిన దృశ్యం

పటాన్‌చెరు, ఏప్రిల్ 29 : హైదరాబాద్‌కు సమీపంలో ఉన్న అమీన్‌పూర్ మండలంలో వేల కోట్ల రూపాయలు విలువ చేసే ప్రభుత్వ భూములు కబ్జాకు గురవుతున్నాయి. ప్రభుత్వ భూములను కొందరు అక్రమంగా కబ్జా చేస్తున్నా రెవెన్యూ అధికారులు పట్టించుకోవడం లేదనే ఆరోపణలు ఉన్నాయి. కోట్ల రూపాయల విలువ చేసే ప్రభుత్వ భూములకు సంబంధించి కొందరు నకిలీ పత్రాలు సృష్టించి, అక్రమంగా కబ్జా చేస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. జేసీబీ యంత్రాలతో ప్రభుత్వ భూమిలోని రాళ్లు, చెట్లు తొలగిస్తున్నా రెవెన్యూ అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. అధికార పార్టీ అండదండలతోనే కొందరు అక్రమార్కులు సర్కారు భూమిని కాజేసేందుకు యత్నిస్తున్నారని ఆరోపణలు ఉన్నాయి. అమీన్‌పూర్ మండలంలోని 343 సర్వేనంబర్‌లో 300 ఎకరాల ప్రభుత్వం భూమి ఉంది. గతంలో ఇందులో ప్రభుత్వం 20ఎకరాల భూమిని తెలంగాణ ప్రత్యేక పోలీసు శిక్షణ కేంద్రానికి కేటాయించింది. కానీ, ఇక్కడ తెలంగాణ ప్రత్యేక పోలీసు శిక్షణ కేంద్రానికి సంబంధించి ఎలాంటి పనులు చేపట్టలేదు. 343 సర్వేనంబర్‌లో ప్రభుత్వ భూమితోపాటు ప్రైవేట్ భూమి ఉందని సమాచారం. కొందరు రాజకీయ నాయకులు తమ అనుచరులతో ప్రభుత్వ భూమిని కబ్జాచేసే ప్రయత్నం చేస్తున్నారని, రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. రెండు రోజులుగా ప్రభుత్వ భూముల్లో యథేచ్ఛగా రాళ్లు, చెట్లు తొలగించి, భూమి చదును చేస్తున్నా రెవెన్యూ అధికారులు చర్యలు తీసుకోవడం లేదని, జేసీబీ యంత్రాలను సీజ్ చేయడం లేదని రెవెన్యూ అధికారుల తీరును స్థానికులు ఎండగడుతున్నారు.

### విచారణకు ఆదేశించాం..

అమీన్‌పూర్‌లోని 343 సర్వేనంబర్‌లో కొందరు వ్యక్తులు రాళ్లు, చెట్లు తొలగిస్తున్నారని మాకు ఫిర్యాదు వచ్చింది. విచారణ చేసి నివేదిక ఇవ్వాలని అమీన్‌పూర్ తహసీల్దార్‌ను ఆదేశించాం. ప్రభుత్వ భూములు కబ్జా చేస్తే ఎంతటి వారైనా చర్యలు తీసుకుంటాం. అమీన్‌పూర్‌లోని ప్రభుత్వ భూములను కాపాడుతాం. కబ్జాదారులకు అధికారులు ఎవరైనా సహకరించినా, ప్రోత్సహించినా వారిపైనా చర్యలు తీసుకుంటాం. ప్రభుత్వ భూములు పరిరక్షించాలని ఇప్పటికే రెవెన్యూ యంత్రాంగాన్ని అప్రమత్తం చేశాం.

–రవీందర్‌రెడ్డి, ఆర్డీవో సంగారెడ్డి

### జీవవైవిధ్యంపై ఎఫెక్ట్..

అమీన్‌పూర్ పెద్ద చెరువుకు సమీపంలో కుమ్మరి కుంట ఉంది. కుమ్మరి కుంటకు సమీపంలోనే 343 సర్వేనంబర్‌లో 300 ఎకరాల్లో పెద్ద అటవీ ప్రాంతం ఉంది. పెద్ద చెరువు సమీపంలో ఉండడంతో జంతువులు, పలు రకాల పక్షులు అటవీ ప్రాంతంలో జీవిస్తున్నాయి. ఇక్కడికి ఏటా విదేశీ పక్షులు వలస వస్తున్నాయి. జీవవైవిధ్యాన్ని కాపాడేందుకు గతంలో బీఆర్‌ఎస్ ప్రభుత్వం ఎన్నో చర్యలు తీసుకుంది. కొందరు అమీన్‌పూర్‌లో ఉన్న చెరువులు, కుంటలు కబ్జా చేయడంతో పాటు ప్రభుత్వ భూములు కబ్జా చేసేందుకు ప్రయత్నం చేసినా రెవెన్యూ అధికారులు చర్యలు తీసుకోకపోవడంతో జీవ వైవిధ్యంపై ప్రభావం చూపుతున్నది. కబ్జా దారులు అటవీ ప్రాంతంలో ఉన్న చెట్లు, రాళ్లు తొలగించి చదును చేస్తుండడంతో జీవవైవిధ్యంపై ప్రభావం చూపుతున్నదని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అమీన్‌పూర్ చెరువులకు ఏటా పలు రకాల విదేశీ పక్షులు వలస వస్తుంటాయి. ఇక్కడే కొద్దిరోజులు ఉండి తిరిగి వెళ్తాయి. ఇప్పుడు వీటి మనుగడకు ముప్పు వాటిల్లే ప్రమాదం ఉంది. రెవెన్యూ అధికారుల కనుసైగలోనే భూఅక్రమాలు జరుగుతున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. ప్రభుత్వ భూమిలో జేసీబీలతో చెట్లు, రాళ్లు తొలగిస్తున్నారని రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేసినా స్పందించడం లేదని, తహసీల్దార్, ఆర్‌ఐలకు సమాచారం అందించినా ఎవరూ ప్రభుత్వ భూమి వద్దకు రాలేదని స్థానికులు తెలిపారు. కబ్జాదారులు జేసీబీలతో చెట్లు నరికివేస్తూ, పెద్దపెద్ద రాళ్లు రప్పలు తొలగిస్తున్నా చదును చేస్తున్నా చర్యలు తీసుకోకపోవడం అనేక అనుమానాలకు తావిస్తున్నది. జిల్లా స్థాయి అధికారుతో పాటు మండల స్థాయి అధికారుల ప్రోత్సాహంతో కొందరు ఇలా రెచ్చిపోయి సర్కారు భూములు కబ్జా చేస్తున్నారనే ఆరోపణలు వస్తున్నాయి.





జహీరాబాద్ డీడీఎస్ సొసైటీ కార్యాలయ ఆవరణలో ఏర్పాటు చేసిన విత్తన ప్రదర్శనలో పాల్గొన్న మహిళా సంఘాల రైతులు, చిరుధాన్యాల విత్తనాలు

# చిరుధాన్యాల పరిరక్షణ అభినందనీయం

## శాస్త్రవేత్త డాక్టర్ గౌరీశంకర్

జహీరాబాద్, ఏప్రిల్ 29 : చిరుధాన్యాల సంరక్షణలో జహీరాబాద్ డీడీఎస్ సొసైటీ మహిళా సంఘాల సభ్యులు చేస్తున్న కృషి ఎనలేనిదని విత్తన శాస్త్రవేత్త డాక్టర్ గౌరీ శంకర్ కొనియాడారు. జహీరాబాద్ సమీపంలోని పస్తాపూర్‌లోని డీడీఎస్ కార్యాలయ ఆవరణలో మంగళవారం అంతర్జాతీయ విత్తన దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా డీడీఎస్ కార్యాలయ ఆవరణలో విత్తన సంరక్షకుల సమావేశాన్ని నిర్వహించారు. డీడీఎస్ సొసైటీ పరిధిలోని 30 గ్రామాలకు చెందిన 60 మంది విత్తన సంరక్షకులు 70కి పైగా దేశీ విత్తనాలను ప్రదర్శించారు. ఇందులో అంతరించిపోతున్న అత్తాకోడళ్ల జొన్నలు, నల్లతొగరి, బుర్క తొగరి, తెల్ల శనగలు, నల్ల కొబ్బరి వంటి అరుదైన విత్తనాల ప్రదర్శన ఆకట్టుకుంది. ఆనంతరం విత్తన శాస్త్రవేత్త డాక్టర్ గౌరీశంకర్ మాట్లాడుతూ..అంతరించిపోతున్న పూర్వ వ్యవసాయ పద్ధతులు, విత్తనాలను మళ్లీ తీసుకువచ్చేందుకు ప్రపంచ దేశాలు సైతం ప్రయత్నిస్తున్నట్లు తెలిపారు. కనుమరుగవున్న చిరుధాన్యాలను కాపాడుతూ, సాగు చేస్తున్న డీడీఎస్ మహిళా సంఘాల చేస్తున్న కృషి అభినందనీయం అని పేర్కొన్నారు. చిరుధాన్యాలతో సంపూర్ణ ఆరోగ్యం చేకూరుతుందన్నారు. డీడీఎస్ ఎగ్జిక్యూటీవ్ డైరెక్టర్ దివ్య వెలుగురి మాట్లాడుతూ..ప్రపంచ వ్యాప్తంగా చాలా దేశాల్లో రైతులు విత్తనాలను దాచుకునే హక్కులు లేవన్నారు. ప్రతి విషయంలో మార్కెట్ మీద ఆధారపడాల్సిన పరిస్థితుల్లో రైతులు ఉన్నట్లు తెలిపారు. డీడీఎస్ సొసైటీ మహిళలు చిరుధాన్యాలను కాపాడుతూ, పంటల సాగు చేస్తున్నట్లు తెలిపారు. ఝరాసంగం మండలం బిడెకన్న గ్రామానికి చెందిన జడల చంద్రమ్మ 58 రకాల విత్తనాలు, న్యాల్‌కల్ మండలంలోని గుంజోట్టికి చెందిన నర్సమ్మ 56 రకాల విత్తనాలు, జహీరాబాద్ మండలం పోట్‌పల్లికి చెందిన మొగులమ్మ 55 రకాల విత్తనాలను ప్రదర్శించారు. వారిని ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్తలు, సొసైటీ సభ్యులు, మహిళా రైతులు పాల్గొన్నారు.

# అనర్హులకు ఇందిరమ్మ ఇండ్లు

## ఫిర్యాదుల వెల్లువ

చేర్యాల, ఏప్రిల్ 29: గ్రామాల్లో ఏర్పాటు చేసిన ఇందిరమ్మ కమిటీల్లో అప్పుడే లుకలుకలు మొదలయ్యాయి. సిద్దిపేట జిల్లా చేర్యాలలో ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులు ఎంపికలో అవకతవకలు జరిగాయని పలువురు కాంగ్రెస్ నాయకులు భువనగిరి ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డిని కలిసి ఫిర్యాదు చేశారు. ఇండ్లు లేని పేదలకు ఇందిరమ్మ ఇండ్లు కేటాయించాల్సి ఉండగా, అనర్హులకు జాబితాలో చోటు కల్పించడంపై పలువురు కమిటీ సభ్యులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మండలంలోని ఆకునూరులో ఇందిరమ్మ కమిటీ సభ్యులకు తెలియకుండానే 49 మంది లబ్ధిదారులతో కూడి న జాబితా ఇటీవల బయటకు వచ్చింది. దీనిని పరిశీలించిన ఇందిరమ్మ కమిటీ సభ్యులు అసలు తమకు తెలియకుండానే లబ్ధిదారులను ఎవరు నిర్ణయించారని, ఇందులో అనర్హులకు చోటు కల్పించారని, తమ సంతకాలు లేకుండా లిస్టు ఎలా వస్తుందని, వెంటనే వాటిలో మార్పులు చేర్పులు చేయాలని డిమాండ్ చేస్తున్నారు. ఎమ్మె ల్యే, ఎంపీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి ప్రచారం చేసిన ఆకునూరుకు చెందిన పలువురు యువకులు ఇందిరమ్మ ఇల్లు వస్తుందనే ఆశతో ఉన్నారు. తీరా లిస్టులో వారి పేర్లు లేకపోవడంతో ఈనెల 28న గ్రామ పంచాయతీ కార్యాలయానికి వెళ్లి ఈవోకు లిస్టులో అనర్హులు ఉన్నారని, వారిని తొలగించి అర్హులకు అవకాశం ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. ముస్త్యాలలో అర్హులకు ఇండ్లు కేటాయించాలని సీపీఎం ఆధ్వర్యంలో ప్రత్యేకాధికారికి వినతిపత్రం అందించారు. గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద నినాదాలు చేశారు. కొన్ని గ్రామాల్లో ఇందిరమ్మ ఇంటికి రూ.50 వేల డబ్బులు అధికార నాయకులు డిమాండ్ చేస్తున్నట్లు ఆరోపణ లు వినిపిస్తున్నాయి. అర్హులకే ఇందిరమ్మ ఇండ్లు కేటాయిస్తామని చేర్యాల ఎంపీడీవో మహబూబ్ అలీ 'నమస్తే తెలంగాణ' ఫోన్‌లో తెలిపారు.



ముస్త్యాల గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద నినాదాలు చేస్తున్న సీపీఎం నాయకులు



భువనగిరి ఎంపీ చామలకు వినతిపత్రం అందిస్తున్న నాయకులు



బెజ్జంకిలో నిరసన తెలుపుతున్న బీఆర్‌ఎస్ నాయకులు

# వ్యర్థాలతో ప్రజారోగ్యానికి హాని

బెజ్జంకి, ఏప్రిల్ 29: సిద్దిపేట జిల్లా బెజ్జంకి మండలం పోతారం శివారులో నిర్మిస్తున్న ఇథనాల్ ఫ్యాక్టరీ వ్యర్థ జలాలను వాగులో కలపటంతో ప్రజల ఆరోగ్యానికి హాని కలుగుతుందని బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు పాకాల మహిపాల్‌రెడ్డి అన్నారు. మం డలంలోని ముత్తన్నపేట శివారులోని వాగులోకి వ్యర్థ జలాలను వదలడంపై బీఆర్‌ఎస్ నాయకులు మంగళవారం ఫ్యాక్టరీని సందర్శించి, సంస్థ ప్రతినిధులను నిలదీశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఫ్యాక్టరీ నుంచి నేరుగా కాలువ తీసి వ్యర్థనీటిని వాగులోకి కలిపారని, దీనివల్ల ప్రజలకు హాని జరిగే ప్రమాదం ఉందన్నారు. కాలువ నిర్మాణంపై స్థానికులు ప్రశ్నిస్తే సంస్థ కార్మికులతో దాడికి ప్రయత్నం చేపించారని, కాలువకు అనుమతులు ఉన్నాయని తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేశారన్నారు. వీటిపై వారిని నిలదీస్తే సమాధానం లేదని, కాలువను పూడ్చి నీరు రాకుండా చర్యలు చేపడతామని తెలిపినట్లు చెప్పారు. కార్యక్రమంలో లింగాల లక్ష్మణ్, కచ్చు రాజయ్య, ముక్కీస తిరుపతిరెడ్డి, రాజామహేందర్‌రెడ్డి, హన్మాండ్ల లక్ష్మారెడ్డి, దీటి రాజు, కనగండ్ల రాజేశం, గాజే సత్యనారాయణ, స్వామి, శేఖర్‌బాబు, కనగండ్ల సతీశ్, శంకర్, శ్రీనివాస్ ఉన్నారు.





రెండు, మూడో వీరగల్లు

# గౌరాయపల్లిలో బయటపడ్డ పులివేట వీరగల్లులు

కొమురవెల్లి, ఏప్రిల్ 29 : సిద్దిపేట జిల్లా కొమురవెల్లి మండలంలోని మల్లన్న ఆలయ సమీపంలో ఉన్న గౌరాయపల్లిలో 17వ శతాబ్దానికి చెందిన పులివేట వీరగల్లులు బయటపడ్డాయి. మంగళవారం కొత్త తెలంగాణ చరిత్ర బృందం పరిశోధకుడు కొలిపాక శ్రీనివాస్ బృందం గౌరాయపల్లిలో వీరగల్లులను పరిశీలించారు. బృందానికి చెందిన హరగోపాల్ మాట్లాడుతూ.. కన్నడ భాషలో హుళిబేటె అని పిలిచే ఈ పులివేట వీరగల్లులు తెలంగాణలో మూటకోడూరు, నిజామాబాద్, గోనెపల్లి, అమ్మనబోలు వంటి పలుచోట్ల లభించాయన్నారు. వీరుడు గ్రామం మీద దాడి చేసిన పెద్దపులితో పోరాడి ప్రజలను కాపాడి అమరులైన సందర్భంగా వారిని స్మరిస్తూ ఏర్పాటు వేసిన వీరశిలలు ఇవి అన్నారు. గౌరాయపల్లిలో గుర్తించబడిన వీరగల్లులు మూడు శిల్పాలలో రెండు పులితో వేటాడుతున్నవి కాగా, మొదటి శిల్పంలో వీరునిత వెనక జడకట్టు ఉందన్నారు. అతడి చెవులకు కుండలాలు ఉన్నాయన్నారు. ఈ మీసాల వీరుడు పులిని రెండు చేతులా పట్టుకొని పోరాడుతున్నాడు. మరొక వీరుడు ఎడమచేతిని మడిచి పులినోట్ల కుక్కి ఎడమకాలితో పులికాళ్లను అడ్డుకుంటూ కుడిచేతితో కత్తితో డాడి చేస్తున్నాడని, నడినెత్తిన సిగుందన్నారు. దీనిని బట్టి ఈ వీరగల్లులు 17,28 శతబ్దాల నాటివని పేర్కొన్నారు. అక్కడే ఉన్న ముడో వీరగల్లు ప్రత్యేకమైనదని, దీన్ని కన్నడంలో సిడితల పిలువబడే గడతల వీరగల్లు శైవభక్తుడు,తన సిగముడిని వంచిన వెదురుగడ కోసకు కట్టుకొని అంజలి పట్టి యోగాసనంలో కూర్చున్నడని పేర్కొన్నారు. పక్కన కత్తి చేతబట్టి అతిని మెడ నరకబోతున్న వ్యక్తి కనబడుతున్నట్లు తెలిపారు. పై అంతస్తులో దైవసాన్ని ధ్యాన్ని పొందిన వీరుడు కనిపిస్తున్నడన్నారు. ఈ శైలిని బట్టి రాష్ట్రకూటుల కాలం నాటిదన్నా. తెలంగాణలో గడతల వీరగల్లులు పదుల సంఖ్యలో లభించాయని, రాయలసీమ కడప మ్యూజియంలో ఇలాంటి వీరగల్లులు ఉన్నాయని హరగోపాల్ తెలిపారు.